ఈ నికృష్ట సమాజంలో—

ఎవడు ధర్మాధర్మాల నిర్ణేత?

# వెంకయ్యనాయుడు: ఒక అనుభూతి

నా రా య ణ

"అయ్యగారు ఉన్నారాండి?"

అప్పుడే నేను ఇంట్లోకి వస్తున్నాను. బయట బాగా యెండగా ఉంది. నేను ఎండలో నుంచి నీడలోకి వస్తూ మసగ్గా ఒక ముసలి ఆయన పైమాదిరిగా అడుగుతూ ఉండటం విన్నాను. బాగా ఏర్పడిన బట్టతల పైనఉన్న నాలుగు వెంట్రుకలూ బాగా నెరసి ఉన్నాయి. రొండివరకూ ఒక తుండుగుడ్డ మోకాళ్ళ పై వరకూ వచ్చేటట్లు కట్టుకున్నాడు. మాట వణుకుతూ ఉన్నది.

'ఎవరికోసమండి?' అన్నాను. మా ఇంట్లో నాలుగయిదు రకాలవాళ్లు ఉన్నారు. ప్రతివారి కోసమూ జనం వస్తూ ఉంటారు. అందువలన యెవరికోసమో ప్రత్యేకం అడగవలసి వచ్చింది.

"ప్లీడరుగారు ఉన్నారాండి?" అని ఆయన అడిగాడు. ప్లీడరుగారు మా బాబాయి. ఆయన కొరకు పార్టీలు ప్రయివేట్లూ వస్తూ ఉంటారు. అప్పటికి నాకు ఆ యెండలోనుంచి రావటంవల్ల వచ్చిన మసగ తగ్గింది. ఈ పైమాట అడుగుతూ ఆయన నావేపుకు ముఖం త్రిప్పాడు. అరే! ఆశ్చర్యంగా ఉంది. ఆయన వెంకయ్యనాయుడే! మొదటిలో గుర్తు పట్టలేనందుకు కించపడ్డాను.

వెంకయ్యనాయుడితో పరిచయము నాకు ఇప్పటిదికాదు. మా బాబాయి ప్లీడరు. ఆయన పదిహేను సంవత్సరాల క్రిందట ప్రాక్టీసు మొదలుపెట్టినపుడు వెంకయ్యనాయుడే ఆయనకు మొదటి వకాలత్ నామా యిచ్చింది. మా బాబాయి తరువాత ఈ సంగతి యెప్పుడూ అనుకొంటూ ఉండేవాడు. ఇంకా నాకు-నాకు ఆ రోజులలో వెంకయ్యనాయుడు గురించి ఒక విధంగానే తెలుసు. నాకు అప్పుడు చాలా చిన్న వయస్సు. వెంకయ్యనాయుడు మాబాబాయికోసం వస్తూన్నప్పుడు, బాబాయిలేని సమయం చూసి ఒక కాణీకాని అర్ధణాకాని అడుగుతూ ఉండేవాడిని. చిన్నతనం! ఎవరిని అడగాలో యెవరిని అడగకూడదో తెలియదు. ఆ సమయానికి ఎవరు మనకు కావలసింది ఇస్తే వారే గొప్పవారు. ఆ మాదిరే ఉండేది ఇతని విషయంలో! అడగ్గానే రెండణాలుతీసి ఇచ్చేవాడు. రెండణాలు అంటే ఆరోజులలో మహాగొప్ప. అర్ధణాకే కాఫీ అరకప్పు. అణాకే మసాలా దోసె-అందుకనే మహా ఆనందంగా ఉండేది. ఎప్పుడయినా బడికి వెళ్తూ ఉండేటప్పుడు కోర్టుదగ్గర చెట్టు క్రింద కూర్చుని కనపడేవాడు. కనపడగానే దగ్గరకు పరుగెత్తుకు వెళ్లేవాడిని. నోట్లోనుంచి కాలుస్తూ ఉన్న చుట్టనుతీసి పక్కనున్న పార్టీలతో నన్ను గురించి ఇట్లా అంటూండేవాడు: "చూడయ్యా ఈ చిన్నాయన: ఈయనకు నాదగ్గరనుంచి డబ్బు కావాలిట. తను సంపాయించేటప్పుడు నాకు ఇస్తాడో ఇవ్వడో కాని ఇప్పుడుమాత్రము కనుపడిన చోటెల్లా నాకో అర్ధణో అని దబాయించి అడుగుతాడు!" అని పకాల్మన నవ్వి నాకు అణానో లేక రెండణాలో ఇచ్చికంపిస్తూ ఉండేవాడు.

తరువాత మళ్లీ పది సంవత్సరాలకి కలవటం-నేను ఏదో చదువులకని ఇతర ఊళ్ళకి వెళ్లటం సెలవలకు మా బాబాయి ఊరువెళ్ళక పోవడం వల్ల ఇతనిని కలుసుకోలేక పోయినాను. అప్పటికి నాలోకూడా మార్పువచ్చింది. చదువుతున్న చదువుతోపాటు లోకజ్ఞానం కొంచెం సంపాయించాను. ప్రపంచం అంటే ఏమిటో చూడ కలిగిన పరిస్థితికి వచ్చాను. ఒకరోజు ప్రొద్దున-అంటే ఆఊరికి వచ్చిన మరుచటిరోజను కొంటాను-కాఫీ తరవాత మా బాబాయిగారింటి సావిట్లో కూర్చునిఉన్నాను. 'ప్లీడరుగారు ఉన్నారా!', అంటూ లోపలికి ప్రవేశించాడు. ఇతని వెనుక నలుగు రయిదుగురు పార్టీలు

ఉన్నారు. నన్ను చూశాడు. నేను అతనిని చూశాను. నవ్వుతూ నాదగ్గరకు వచ్చాడు. 'ఏం! ఎట్లా ఉన్నారు! అబ్బాయిగారు కులాసా! ఏవన్నా ఇప్పుడన్నా నాకు సంపాయించి పెడతారా!' అని పార్టీలవేపు చూసి సాభిప్రాయంగా నవ్వి "ఈయన ప్లీడరుగారి అన్న కుమారుడు. మా ఇద్దరి పరిచయం ఆయనకే తెలుసు' అని నావేపు చూసి పెద్దగా నవ్వాడు. నేను నవ్వాపుకో లేకపోయినాను.

కుశల ప్రశ్నలు అయినాయి. ఇంతలో మా బాబాయి వచ్చాడు. ఇంక కోర్టువ్యవహారాలలో పడ్డారు. ఏదో మాట్లాడారు. అసలు ఏమీ లేని వ్యవహారానికి పెద్ద సమస్య తెచ్చిపెట్టారు. పార్టీల దగ్గరనుంచి నూరు రూపాయిల వరకూ మాట్లాడారు. ఖర్చులకని కొంత డబ్బు మా బాబాయి అడిగి తీసుకొన్నాడు. తరువాత పార్టీలను కోర్టు దగ్గర కలువమన్నాడు ప్లీడరు గారు. 'సరే మీరు వెళ్తూ ఉండండి వస్తూన్నాను' అని వెంకయ్య నాయుడు వెనక్కు తగ్గాడు. ప్లీడరు గారు అతని చేతిలో కొంత డబ్బు ఉంచాడు.

దానితో అర్థమయింది వెంకయ్యనాయుడి వడవడి. నాలో అతనిపైని గౌరవభావము తగ్గి, ఈ ప్రకృతిని చూసేటప్పటికి కొంచెము వెగటనుపించింది. పూర్వము నా చిన్నతనంలో అర్థం చేసుకొన్న వెంకయ్య నాయుడు వేరు. ఇతను వ్యవహారికుడు. ఇతను తెలియని అమాయక జనానికి మాటలు చెప్పి తన ఇష్టప్రకారము నడిపించటం తెలుసు. ఇతను లేని వ్యవహారాలను పుట్టించకలడు- దానిని సమర్థించ కలడు——

తరువాత కలువటం ఇప్పుడు——

'ఏం! వెంకయ్యనాయుడూ! గుర్తున్నానా!' అని పలుకరించాను.

ముఖం పూర్తిగా నావేపుకు త్రిప్పాడు. ఇప్పుడు అతనిని పూర్తిగా చూడకలిగాను. ముఖంలో బాగా ముడతలుపడ్డాయి బుగ్గలు జారి పోయినాయి- కన్నులు- కన్నులలోనే, చెప్పుకో తగ్గ విశేషము- కనుపాపలు గాజు చిప్పలులాగున్నాయి. చూపులేదని మాత్రము తెలుస్తుంది- కాని ఏదో తెలియని తీక్ష్ణత మాత్రము పోలేదు. పూర్వముకంటే ఎక్కువయిందా అని అనిపిస్తుంది.

కొంచెము సేపు అయాక నావేపు చూశాడు. "తెలియకేమండి! ఇప్పుడన్నా ఏమన్నా సంపాదనలో పడ్డారా! మీకోసమే ఇన్నాళ్లూ కనిపెట్టుకు కూర్చున్నా! ఇప్పుడయినా నా విషయంలో చార్జీ తీసుకొంటారా!" అని నవ్వాడు. నవ్వటంలో ముఖంలోని ముడతలన్నీ కదిలినాయి- ఇంకా పూర్వపు వెంకయ్యనాయుడే. వయస్సులో మార్పు కనుపించినప్పటికీ మాటలు వెనుకటివే.

"ఏం పనిపైన వచ్చావు?' అని అడిగాను.

అతను ముసలితనంలో ఏదో మా బాబాయిని డబ్బు సహాయము అడగటానికి వచ్చి ఉంటాడనుకొన్నాను.

'లేదండి! ఏదో ఒకతనిని తీసుకువచ్చాను. అతనికి ఏదో సలహా మీ బాబాయిగారి దగ్గర నుంచి కావాలిట- అతనికి ఇప్పిద్దామని- ఏదో నా చిన్ననాటి స్నేహితుడు లెండి!' అని అన్నాడు.

మనసు మారనందుకు విచారించాను. నే నను కొన్నది వేరు. జరిగినది వేరు. వయస్సు గడిచాకయినా ఆ పూర్వపు ప్రాపంచిక అన్యాయాలన్నీ విడిచాడనుకొన్నాను. ఆమాదిరి పుస్తకాలలో వింటూవచ్చాము కాని వాస్తవిక ప్రపంచములో జరుగుతున్నది వేరు. ఇతను ఇంకా పూర్వపు వెంకయ్యనాయుడే——

ఇంతలో మా బాబాయి వచ్చాడు.

'ఏం నాయుడూ! విశేషం'' అన్నాడు.

"ఉండండి" అని మా బాబాయితో అని 'నరసయ్యా' అని పెద్దగా పిలిచాడు. బయట నుంచి ఒక ముసలి లోపలికి వచ్చాడు. ఆయన వయస్సు 75 వరకూ ఉంటాయి. శిలకు తలగుడ్డ చుట్టాడు. చొక్కా లేదు. ధోవతి చెంగావి రంగు, మామూలు పద్ధతిలో మోకాళ్లవరకు లాగి కట్టాడు.

లోపలికి రావటంతోనే "నమస్కారము" అంటూ మా బాబాయికి వంగి దణ్ణము పెట్టాడు. వెంకయ్య నాయుడు చెప్పటం సాగించాడు. నరసయ్యను చూపిస్తూ : "ప్లీడరుగారు, ఇతనిని గురించేనండి నేను చెపుతూ ఉన్నది." సాభిప్రాయంగా నరసయ్యవేపు చూసి మళ్లీ చెప్పటం మొదలుపెట్టాడు, "ఇతను రిటైర్డు సుబేదార్. పెన్షను కాగితం పోయిందండి, మళ్లీ దానికొరకు

దరఖాస్తు పెట్టవలెనండి. ఆ విషయమంతా మీరు చూసి తప్పకుండా పనిఅయేటట్లు చూడవలెనండి.'' "ఏమంటావు నరసయ్యా!" అని ఆయనవేపు చూశాడు.

"అవునండి" అంటూ ఆయన మళ్లీ మా బాబాయికి వంగి దణ్ణము పెట్టాడు.

''కాగితాలు కొన్ని కావాలి. మీరు పూర్వము పనిచేసి రిటైర్ అయిన తేదీ, ఆ ఉద్యోగ వివరాలు కావాలి.'' అని మా బాబాయి అన్నాడు.

''దానికేమండి. కాగితాలన్నీ జాగ్రత్తగా ఉంచాడండి. మనిషే బహుజాగ్రత్త అండి. ఎందువలనో కాని ఈ కాగితము పారవేసుకున్నాడు.'' ''కాదా నరసయ్యా'' అని ఆయనను అడిగాడు.

"అవున"ని ఆయన తల ఊపాడు.

''ఏదో కాలవశాత్తూ అండి! ఇంతవరకూ ఒక వస్తువు పోవటం అంటూ ఎరగను. పూర్వము సర్వీసులో ఉన్నప్పుడు దొరగారికి నేనంటే ఎంతో ఇష్టమండి! అవి అన్నీ పూర్వపురోజులు! మేము పూర్వకాలపువాళ్లము. ఆరోజులే వేరు, ఆ ప్రేమలే వేరు" అంటూ మొదలుపెట్టాడు.

"సరేలే! దానికేంలే, నరసయ్యా! కాగితాలు అయ్యగారికి ఇవ్వు'' అని వెంకయ్య నాయుడు ఆపాడు.

బొడ్డులోనుంచి ఒక కాగితాలకట్ట తీశాడు నరసయ్య. దులిపి మా బాబాయికి ఇచ్చాడు. ఆ కాగితాలు చదివాడు మా బాబాయి. కొంచెముసేపు ఆలోచించాడు.

'ఇదిగో నాయుడూ! ఇది చాలా కష్టమయిన విషయం. నీకూ తెలుసు. దరఖాస్తు కాగితం వ్రాయటమే కాకుండా కలెక్టరు దొరవారికి స్వయంగా సమర్పించవలసి ఉంటుంది. సరే! నీ స్నేహితుడు అంటున్నావు. ఆలోచించి చెప్పు నీ ఇష్టప్రకారము నడచుకొంటాను" అన్నాడు.

''అవునండి! అందుకనే మీదగ్గరకువచ్చాము. ఏదో అటూఇటూ కొంచెం ఇదిగా చూడండి. మీరే చెప్పండి ఎంత ఇమ్మంటారో?" అన్నాడు నాయుడు.

"ఇదిగో చూడు, కష్టమయిన విషయం కదా ఒక ఏభై రూపాయలు ఇప్పించు'' అని మా బాబాయి అడిగాడు.

''ఏదో బీదవాడు. వచ్చే పెన్షనే నెలకు పదిహేనురూపాయిలు. మీరు కొంచెము అతనిపైన దయ చూపాలి." "ఏమంటావు నరసయ్యా!" అన్నాడు నాయుడు.

''నిజమేనండి అయ్యా! ఈ గుడ్డలూ నేనూ చూడండి. చాలా బీదరికము అనుభవిస్తున్నాను. కొంచెము ఏదో ఆధరువని ప్రయత్నము. దయ చూపాలి. ఈ డబ్బువస్తే తప్ప నాదగ్గర దమ్మిడీ లేదు" అని అంటూ నరసయ్య వంగి దణ్ణము పెట్టాడు.

''ఆయన లక్షాధికారి! వదలిపెట్టవద్దు'' అని ఇంగ్లీషులో అంటూ తెలుగులో మామూలుగా సాగించాడు నాయుడు, "ఏదో చూడండిమీరు! అతను చెప్పింది నిజము. మీ ఫీజు ఇవ్వాలంటే అప్పు చేయాలండి!''

ఇంతవరకూ ఊరికే కూర్చున్నాను. ఇప్పుడు నాయుడు వేపు చూశాను. అతని గాజు చిప్పల్లాంటి కళ్లలో ఒక దీపం వెలిగింది-పరిహాసంతో నిండింది. ఇంతకంటే కుటిలత ఇంకా ఎక్కువ చూడబోము. అతని కళ్ళవేపు చూడలేక పోయాను. నా మనస్సులో ఆలోచనలు అతనిని గురించి ఒక రకము. జరుగుతున్నది ఒకరకం. మార్పు ఏమాత్రమూ లేదు. అతనిలో నేననుకొన్న ప్రకారము మార్పు లేకపోవటంతో నాకు అతనంటే వెగటు పుట్టించింది. ఇంగ్లీషులో లక్షాధికారంటూ అదే వరసలో దానికి విరుద్ధమైనది అప్పుడే చెప్పగలిగాడంటే-అందులో ఆ వయస్సులో-అతనంటే నే నేమనుకోవాలి? మనిషికి వయస్సుతో మార్పు లేదా! అతను మొదటినుంచీ చివరవరకూ ఒకే ప్రవ



త్తిలో మెలగుతాడా! ఈ ప్రవృత్తి ఈతని నిజస్వభావమా? లేక పొట్టకూటికి పాకులాడే తాత్కాలిక వ్యవహారమా? నేను అనుకొన్న వెంకయ్యనాయుడు నా మనస్సుకు సమాధానమియ్యలేకపోయాడు.

వారం రోజుల తరువాత నేనూ, బాబాయీ భోజనం చేస్తూండగా—

బాబాయి అన్నాడు: "ఏంరా! విన్నావా! పాపం వెంకయ్య నాయుడు పోయాడు. మొన్న వచ్చి ఒక రెండణాలు అడిగాడురా! లేక పోయింది- లేదన్నాను. కాని నాకు మొదటి వకాల్తనామా ఇచ్చింది ఇతనేరా! ఎంతో మంచి వాడు. చివరవరకూ నాకే కేసులు ఇస్తూండే వాడు. చూడు వారంక్రిందట కూడా! నువ్వు చూశావుగా ఆ ముసలివాడి విషయం! అది కూడా నాకే ఇచ్చాడు. దాని ఏమీ చేయవలసింది లేకపోయినా, ఏదో కల్పించాడు. ఇదే, అతనంటే! ఏం తెలివి! ఏం వ్యవహారము!"

నాకు వ్యవహారాలతో పనిలేదు. నాకు అతని తెలివి ఒక తెలివిగా కనుపించటం లేదు. నా వెంకయ్యనాయుడు వేరు. అతని ప్రవృత్తి వేరు. నాకు అతను జ్ఞాపకానికి వచ్చాడు. మధ్య వచ్చిన వెంకయ్యనాయుడు భౌతికశరీర నాశనంతోపాటు నా మనస్సులో కూడా నశించాడు. అతను మా బాబాయికి రెండణాలు అడుగుతూ ఉన్న దృశ్యం ఊహించుకొన్నాను. నేను చిన్నపుడు అతనిని కాణీ అర్ధణాలు అడిగిన దృశ్యాలు గుర్తుకు వచ్చాయి. నాలోని అసమర్థత, నాలో అతనిని గురించి చేసిన అవివేక విమర్శనకు నొచ్చుకున్నాను. కనీసం ఆమాదిరి ఆలోచించకపోయినా అతనికి సమయానికి సాయపడే వాడినేమో! సమయానికి కృతజ్ఞత చూపించలేని నా అసహాయతకు విచారపడ్డాను. కాని ఏం లాభం! అయిపోయింది.

కాని ప్రస్తుతము నా ఆలోచన మొదటి వెంకయ్యనాయుడు గురించే. అతని విషయంలోనే నా కృతజ్ఞత. అతను నాలో సుస్థిరుడు. మధ్య వచ్చిన వెంకయ్యనాయుడు ఒకకల-అతను ఈ అనంత కాలగర్భంలో విలీనమయ్యాడు. పాపమనేది ఉంటే అది కాలగర్భపు లోతుల్లోకి మునిగి సమసిపోయింది.


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

అధికారము పొందబడిన మూలధనము
రు. 1,00,00,000

చందావేయబడి జారీచేయబడిన మూలధనము
48,99,000

చెల్లించబడిన మూలధనము 25,00,000
రిజర్వు ఫండు 9,00,000
డిపాజిట్లు 5,00,00,000

అమలులోవున్న వ్యాపారము
మొత్తం రు.6,00,00,000కు మించినది.

ఫిక్సెడ్ డిపాజిట్లు:-నూరు రూపాయలకు తక్కువగాని మొత్తములు 3, 6, 12, 24 మాసములకు అన్ని బ్రాంచీలలోను తీసుకొన బడుచున్నవి.

3 సంవత్సరముల క్యాషు సర్టిఫికెట్లు ఈ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము. అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండ్లు, వారంట్లు, హుండీలు వసూలుచేసి పెట్టబడును.

గవర్నమెంటుపత్రములు, షేర్లుకొనుట అమ్మకట మొదలగు వ్యాపారములుకూడ చేయబడును.

వివరము లే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

తాడేపల్లి శ్రీరాములు
మేనేజింగ్ డైరెక్టర్.

వారణాసి కృష్ణమూర్తి
ఎం.ఏ.బి.కాం., ఎల్.ఎల్.బి., సి.ఎ. ఐ. ఐ.బి.,
జనరల్ మేనేజరు.